50 వసంతాల 'స్కూల్ బెస్టీస్'

వినూత్న వేడుకలకు పూర్వ విద్యార్థుల శ్రీకారం


చిన్నప్పుడు స్కూల్‌లో గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు(ఫైల్)


గోవాలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు(ఫైల్)


ఇటీవల దిండిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు(ఫైల్)

సండే స్పెషల్

- 'స్కూలులో సెల్ఫీ.. బుగ్గలో బిర్యానీ...'
- యాభై ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్టూడెంట్స్
- ఈ నెల 30 న సందడి చేయనున్న పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీ: వారి ఆ'పూర్వ' స్నేహానికి 50 ఏళ్లు... సరిగ్గా యాభై ఏళ్ల క్రితం.. ఆ స్కూలులో ఒకటో తరగతితో మొదలైన వారి స్నేహం 'స్కూల్ బెస్టీస్' వాట్సాప్ గ్రూప్ సాక్షిగా ఇంకా కొనసాగుతూనే ఉంది. గోదావరిఖనిలోని 'సెక్రెడ్ హార్ట్ స్కూల్లో' ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి దాకా (అమ్మాయిలు పదో తరగతి దాకా) క్లాస్‌మేట్స్ ఉన్న 50 మంది పూర్వ విద్యార్థులు.. 50 ఏళ్ల స్నేహానికి గుర్తుగా మరోసారి అదే స్కూలులో ఈనెల 30 న కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులతో ప్రత్యేక ఈవెంట్ నిర్వహించడానికి ఆర్గనైజర్లు ఏర్పాట్లు చేస్తున్నారు.



'స్కూల్ బెస్టీస్' వాట్సాప్ గ్రూప్ లోగో

వినూత్న కార్యక్రమం..

'స్కూలులో సెల్ఫీ.. బుగ్గలో బిర్యానీ...' పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వృత్తిరీత్యా పలు ప్రాంతాల్లో సెటిలైన అలనాటి బాల్య మిత్రులంతా... ఏప్రిల్ 30న సేక్రెడ్ హార్ట్ స్కూల్‌లో కలుసుకుని సెల్ఫీ దిగి, స్కూలుతో తమకున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, అనంతరం స్కూల్ రోజుల్లో పిక్నిక్‌కు తీసుకెళ్లిన రామగుండం బసంత్‌నగర్‌లోని బుగ్గకు వెళ్తారు. అక్కడ లంచ్ (బిర్యానీ) చేసి తీపి జ్ఞాపకాలతో తిరిగి వెళ్తారు.

ఉమ్మడి జిల్లాలో 'స్కూల్ బెస్టీస్' పాపులర్..

గోదావరిఖనిలోనే కాకుండా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ 'స్కూల్ బెస్టీస్' ఇప్పటికే బాగా పాపులర్ అయ్యింది. ఈ గ్రూపులో మొత్తం 60 మంది సభ్యులున్నారు. ముఖ్యులు ఎం.గోపీకృష్ణ, వి.కోటేశ్వరరావు, జొన్నల రవీందర్, జోజిరెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, ముద్దసాని శ్రీనివాసరెడ్డి, విజయ, వసుంధర తదితరులు ఉన్నారు. వీరంతా యాభై ఏళ్ల పైబడిన వారు కావడం విశేషం. ఇప్పటికే ఈ గ్రూపు సభ్యులు గోవా, దిండి రిసార్ట్‌లో పలు కార్యక్రమాలు ఏర్పాటుచేసి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. మూడో ట్రిప్‌గా 'సెక్రెడ్ హార్ట్ స్కూలు'తో తమకున్న అనుభవాలను పంచుకునేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరవుతారని కోఆర్డినేటర్స్ వెల్లడించారు.

సంతోషంగా ఉంది



యాభై ఏళ్ల క్రితం సెక్రెడ్ హార్ట్ స్కూల్‌లోనే మా స్నేహం మొదలైంది. గతేడాది తొలిసారిగా గోవాలో కలిశాం. గత నవంబర్‌లో మరోసారి 'దిండి రిసార్ట్స్'లో కలిసి చాలా సందడి చేశాం. ప్రతీ ట్రిప్‌కు కొత్త మిత్రులు కలుస్తూనే ఉన్నారు. ఈనెల 30న గోదావరిఖనిలో నిర్వహించే ఈవెంట్‌లో ఇంకొందరు తొలిసారి కలవబోతున్నారు. చిన్నప్పటి మిత్రులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ఆర్.విజయ, ప్రభుత్వ లైబ్రేరియన్,గోదావరిఖని

వినూత్న కార్యక్రమం..



మా గ్రూపులాగా ఉండటం ఎవరికైనా కష్టం. ఎందుకంటే మేమంతా ఒకటో తరగతి నుంచి స్నేహితులం. అమ్మాయిలు, అబ్బాయిలు యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. 'స్కూలులో సెల్ఫీ.. బుగ్గలో బిర్యానీ...' అనేది ఓ వినూత్నమైన కార్యక్రమం. స్కూలుకు ఏమైనా సాయం చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నాం.

– వి.కోటేశ్వరరావు, బిజినెస్‌మ్యాన్, గోదావరిఖని

స్నేహమే జీవితం...



చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు సిద్ధమవుతున్నాం. ఎక్కడెక్కడినుంచో ఈ కార్యక్రమం కోసం బాల్య మిత్రులు వస్తున్నారు. ఏప్రిల్ 30న మరోసారి చిన్నపిల్లలం అవుతాం. ఈ వయసులో ఇంట్లో వాళ్లను ఒప్పించి, ట్రిప్‌లు వేస్తున్నామంటే గొప్పే కదా. స్నేహమేరా జీవితం...స్నేహమేరా శాశ్వతం అంటారు కదా.

– జొన్నల రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గోదావరిఖని

క్లుప్తంగా

అయోధ్యనగర్‌లో హైటెన్షన్ కేబుల్స్ తొలగింపు


కేబుల్స్ తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

రామగుండం: పట్టణంలోని అయోధ్యనగర్ కాలనీలో వృథాగా ఉన్న హైటెన్షన్ కేబుల్స్‌ను శనివారం ట్రాన్స్‌కో ఏఈ బేతి దామోదర్‌రావు ఆధ్వర్యంలో తొలగించారు. ఏళ్లుగా కాలనీలో ఇళ్ల పైనుంచి కేబుల్స్ ఉండడంతో గృహ నిర్మాణాలకు అడ్డుగా మారడంతో అభివృద్ధికి ఆటంకం కలిగింది. స్థానిక కార్పొరేటర్ కౌశిక లత ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎట్టకేలకు వినియోగంలో లేని హైటెన్షన్ కేబుల్స్ తొలగిస్తామని ట్రాన్స్‌కో పేర్కొంది. ఫలితంగా కాలనీతో పాటు సమీప కాలనీల మీదుగా ఉన్న కేబుల్స్‌ను 20 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి తొలగించడంతో ఇళ్ల నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు.

మోదీ రాకను వ్యతిరేకిస్తూ సీఐటీయూ నిరసన


నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

గోదావరిఖని: దేశప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ రాకను నిరసిస్తూ బొగ్గు గని కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని గనులపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బొగ్గుబ్లాకుల ప్రయివేటీకరణ చేపట్టి కార్మిక వ్యతిరేకిగా మిగిలారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు మెండె శ్రీనివాస్, మేదరి సారయ్య, జిల్లా గజేంద్ర, కారం సత్తయ్య, శ్రీనివాసరావు, ఎస్‌కేగౌస్, దాసరి సురేష్, శశి, నంది నారాయణ, శ్రీనివాసరావు, వంగల రాములు, తదితరులు పాల్గొన్నారు,

నాట్యంలో 'ఖని' చిన్నారి ప్రతిభ


చిన్నారికి మెమొంటో అందిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ:గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన దయానంద్‌గాంధీ, కవిత దంపతుల కూతురు శ్రీధృతి నాట్యంలో ప్రతిభను చాటుకుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ వేదికపై, శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఉగాది పురస్కార మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేదికపై శ్రీధృతి ప్రదర్శించిన నాట్యంకు అబ్బురపడిన అతిథులు అభినందించారు. అతిథుల చేతుల మీదుగా శ్రీధృతి మెమొంటోను అందుకోవడంపట్ల కుటుంబ సభ్యులతోపాటు పలువురు అభినందించారు.

మంత్రిని కలిసిన జీఎం


మంత్రిని శాలువాతో సన్మానిస్తున్న జీఎం

గోదావరిఖని: రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్థానిక ఇల్లెందు క్లబ్‌కు వచ్చిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, మేయర్ బంగి అనిల్‌కుమార్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

ఫెర్టిలైజర్‌సిటీ: గౌతమినగర్‌లోని శ్రీ అభయాంజనేయ ఆలయ అధ్యక్షుడు, ఎఫ్‌సీఐ మాజీ ఉద్యోగి కొమురవెల్లి లింగమూర్తి కుమారుడు కొమురవెల్లి సతీశ్ కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి ఈశ్వర్ పరామర్శించారు. కార్యక్రమంలో రామగుండం మేయర్ డాక్టర్ బి.అనిల్ కుమార్, గౌతమినగర్ సొసైటీ అధ్యక్షుడు గోపాలరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్ శర్మ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసీతారాముల పట్టాభిషేకం


వేడుకలకు హాజరైన భక్తులు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరుకాగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాయకస్వామి శకటోత్సవం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల–వేగురుపల్లిలోని మానేటి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శకటోత్సవం, డోపు కథను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గజవాహనంపై అండాళ్ అమ్మవారు, అశ్వ వాహనంపై శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామివార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజేందర్‌గౌడ్, నగేశ్, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, ధర్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

రామగుండం: బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌ను రామగుండం రైల్వేస్టేషన్‌లో అంతర్గాం మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధాన నరేంద్రమోదీ హైదరాబాద్‌లో నిర్వహించిన సభకు శనివారం బీజేపీ నాయకులు రామగుండం నుంచి ప్రత్యేక రైలులో తరలివెళ్లారు. బీజేపీ ప్రతినిధులు బుసిపాక సంతోష్, వడ్డెపల్లి రాంచందర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: గౌతమినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్‌నగర్, ద్వారకానగర్, ఎన్టీఆర్‌నగర్, ఇందిరానగర్, గౌతమినగర్, లక్ష్మీపూర్, చైతన్యపురికాలనీ, ఖాజిపల్లి,మాతంగికాలనీలలో, పీజీసెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కండేయకాలనీ, దుర్గానగర్, అశోక్‌నగర్, గణేష్‌నగర్‌లో నేడు ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖనిటౌన్: క్రైస్తవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి, వారి సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రామగుండం ఎమ్మెలే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన రన్ ఫర్ జీసెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజం కోసం, ప్రజల కోసం ఏసు ప్రభువు ప్రాణాలను సైతం త్యాగం చేశాడని అన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పేవిధంగా బైబిల్‌లో వాఖ్యలు ఉన్నాయని ప్రతి ఒక్కరు సమాజ హితం కోసం పాటు పడాలని ఆయన అన్నారు. శత్రువును సైతం ప్రేమించే విధంగా బైబిల్‌లో వాఖ్యలు ఉన్నాయని ఆయన అన్నారు. మన కోసం జన్మించి శిలువ ఎక్కిన ఏసు ప్రభువు అడుగు జాడల్లో నడవాలని, అందరూ మతసామరస్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పలు పక్షాల భాధ్యులు ఐపీఎఫ్ ప్రెసిడెంట్ డా.ఎం.ప్రకాశ్, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ కె.లాజరస్, జనరల్ సెక్రటరీ పాస్టర్ జి.థామస్, జాయింట్ సెక్రటరీ పాస్టర్ పి.ఇశ్రాయేలు, ట్రెజరర్ పాస్టర్ ఎం.మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహాధర్నాకు తరలిన టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం గోధావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మహాధర్నాకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఆర్జీ- 3, ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల నాయకులు దేవ శ్రీనివాస్, దాసరి మల్లేశ్, వేముల రవిశంకర్, వేగోళపు మల్లయ్య, బైరం సదానందం, ధర్నాకు తరలివెళ్లారు.

సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

ఓదెల: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శానగొండ, బాయమ్మపల్లె, ఇందుర్తి గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, రైతు సమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగొని శ్రీకాంత్ గౌడ్, సర్పంచులు అంబాల సంధ్యారాణి, గుంటి సునీత, తొల్సూరి కొంరయ్యయాదవ్, ఉపసర్పంచ్ గట్టు మహేశ్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయండి

రామగిరి:హైదరాబాద్‌లోని హోటల్ సితార గ్రౌండ్‌లో ఈనెల 10న రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల శంకర్ కోరారు. ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి నూనె రాజేశం, మండల ప్రధాన కార్యదర్శి బొంకూరి పోషం, ఆర్గనైజింగ్ సెక్రటరీ తొగరి స్వామి, టౌన్ ప్రెసిడెంట్ సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

పుట్ట నారాయణ కుటుంబాన్ని ఆదుకోండి

గోదావరిఖని: పోలీస్ కాల్పులకు బలైన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి తమ్ముడు రాజన్న రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరారు. శనివారం గోదావరిఖని మహాధర్నాలో మంత్రిని కలుసుకుని వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి నారాయణ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లేక ఐదెకరాల భూమి ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

సీనియర్ జర్నలిస్టుకు పరామర్శ

పెద్దపల్లి: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ కీర్తి రమేశ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి గల కారణాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు జూలపల్లి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పాటకుల అనిల్, రవితేజ, చిగిరి, పిన్నింటి, అర్మాన్ తదితరులు ఉన్నారు.

చెక్కులు అందజేత

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కసిరెడ్డి అనిల్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. రాజుకు రూ.24,500 కనుకుల గ్రామానికి చెందిన డి.ప్రశాంత్‌కి రూ.50 వేల చెక్కులు అందజేశారు.

నియామకం

కాంగ్రెస్ అధికార ప్రతినిధుల నియామకం

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులుగా చుక్కల శ్రీనివాస్, సారయ్య నాయక్‌ను శనివారం నియమించారు. ఏఐసీసీ సెక్రెటరీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఇద్దరికి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, ముదాం శ్రీనివాస్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షుడిగా శ్రీనివాస్

రామగిరి: ముత్తారం కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షుడిగా అమ్ము శ్రీనివాస్‌ను నియమించినట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందుల ఎల్లస్వామి, రాష్ట్ర కార్యాదర్శి దయ్యాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం నూతన కమిటీని నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా కాట్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా అమ్ము కుమార్, ఉపాధ్యక్షుడిగా దయ్యాల చెంద్రశేఖర్, కోశాధికారిగా కాట్ల సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా పోతరాజు మహేశ్, కార్యదర్శిగా అమ్ము శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఉమ్మల్ల దేవేందర్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎంజీపీ జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా రాజ్‌కుమార్

సుల్తానాబాద్: మహాత్మా జ్యోతి బాపూలే జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మంత్రి గంగుల కమలాకర్ సిఫారసు మేరకు మండలంలోని గర్రెపల్లికి చెందిన తంగళ్లపల్లి రాజ్ కుమార్‌ను నియమించారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు మంత్రి గంగుల కమలాకర్‌కు, ఎంపీ ఆర్ కృష్ణయ్యకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

జూలపల్లి: యాదవ సంఘం జూలపల్లి నూతన కమిటీ అధ్యక్షుడిగా కొమ్మ ఐలయ్య,ప్రధాన కార్యదర్శిగా మల్లెత్తుల అంజి యాదవ్, ఉపాధ్యక్షులుగా మెండె రాజయ్య, మల్లెత్తుల కనుకయ్య ,కోశాధికారిగా వెంకటరమణ, కార్యదర్శిగా మల్లేశం,పాచాలు,సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

మానవాళి మనుగడకు కృషి చేయాలి


శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న పుట్ట మధు

రామగిరి: కులం, మతం ఏదైనా మానవాళి మనుగడను కాపాడేలా, యువతరం చెడుమార్గాల్లో నడవకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. కమాన్‌పూర్ ఎక్స్ రోడ్ నుంచి బేగంపేట ఎక్స్‌రోడ్ వరకు యూపీఎఫ్ పాస్టర్ల ఆధ్వర్యంలో చేపట్టిన రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. యేసుక్రీస్తు జననం , మరణం ఎంతో గొప్పదన్నారు. యేసు ప్రభువు సిలువ వేయబడి చనిపోయిన రోజుగా, ప్రజలను రక్షించుకోవడానికి ఆయన తిరిగి లేచిన రోజుగా యేసు విశ్వాసకులు మాకు దేవుడున్నాడనే నమ్మకంతో ఘనంగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, కమాన్‌పూర్ మండల టీఆర్ఎస్‌అధ్యక్షుడు పిన్నింటి కిషన్ రెడ్డి, యూపీఎఫ్ పాస్టర్స్ ప్రెసిడెంట్ కాసారపు కుమార్, గౌరవ అధ్యక్షుడు కే దాసు, వైస్ ప్రెసిడెంట్ ఎస్. దానియల్, సెక్రటరీ ఎల్. జాన్‌పాల్, పాస్టర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే వేడుకలు

కమాన్‌పూర్: మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు నుంచి బేగంపేట ఎక్స్ రోడ్డు వరకు యూపీఎఫ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు నీలం సరిత, బొల్లపల్లి శంకర్ గౌడ్, ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలనూర్‌లో రన్ ఫర్ జీసస్

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో ఫిలిఫిల్ఫియా చర్చి ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. శనివారం గ్రామంలో ప్రధాన రహదారుల వెంట పాస్టర్ జీ జేవీయర్ ఏలియస్ ఆధ్వర్యంలో సువార్త ర్యాలీని నిర్వహించారు. దేవుడి దృష్టిలో అందరూ సమానులేనని శాంతి కలగాలని ప్రచారం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ సామ మణెమ్మ, పాస్టర్ అక్సా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దంపేటలో బలగం చిత్ర ప్రదర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట లో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆధ్వర్యంలో బలగం సినిమా ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్‌తో పాటు పార్టీ ముఖ్య ప్రతినిధులు ప్రజలతో కలిసి తిలకించారు. డిజిటల్ ప్రపంచంలో అంతరించిపోతున్న మానవ సంబంధాల విలువలను కళ్లకు కట్టినట్లు చూపించి ప్రజల గుండెల్లో 'బలగం' సినిమా గూడు కట్టుకుందన్నారు.

అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లు పరిశీలన

రామగిరి: సెంటినరీకాలనీలో ఈనెల 14న నిర్వహించనున్న భారతరత్న బీఆర్. అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లను శనివారం నిర్వాహణ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, ఎస్ఓటూ జీఎం జి. రఘుపతి మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఎలీషా, సివిల్ ఎస్ఈ పద్మరాజు, ఎస్సీ లైజన్ అధికారి శ్రావణ్ కుమార్, డీవైపీఎం కావూరి మారుతి, పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును విమర్శించే అర్హత ఉందా?

రామగిరి: స్వార్థ ప్రయోజనాల కోసం పూటకో పార్టీ మారే దళారులకు ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును విమర్శించే అర్హత ఉందా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య అన్నారు. రెండు రోజుల క్రితం ముత్తారంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కాదని అది పుట్ట మధు అహంకార సమ్మేళనం అని ఎద్దేవా చేశారు. పుట్ట మధుకు రాజకీయ భవిష్యత్తు కల్పించిన స్వర్గీయ శ్రీపాదరావు కుటుంబాన్ని విమర్శించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని బహుజనవాదం పేరిట పుట్టమధు మరో కొత్త నాటకానికి తెరలేపాడని విమర్శించారు. ఎమ్మెల్యే టికెట్ కోసం మరో నాయకుడు పోటీకి వచ్చే సరికి ప్రజలపై కపట ప్రేమలు వొలకబోస్తున్నాడన్నారు. ఇప్పటికైనా శ్రీధర్‌బాబును విమర్శించడం మానుకోవాలని లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, గౌడ సంఘం నాయకుడు దాసరి చంద్రమౌళి, అలుగం సంపత్, పాల్గొన్నారు.